క్లుప్తంగా

డ్రాప్ అవుట్ చిన్నారులను బడిలో చేర్పించేందుకు కృషి


మాచరలో చిన్నారికి అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగి

కపిలేశ్వరపురం: వివిధ కారణాలతో బడికి దూరమైన చిన్నారులను తిరిగి బడిలోకి చేర్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 19 గ్రామాల్లోని డ్రాప్ అవుట్ చిన్నారుల వివరాలను సేకరించారు. ఇంటింటికీ వెళ్లి వారికి చదువు ప్రాధాన్యతను వివరిస్తున్నారు. మాచర సచివాలయం పరిధిలో మంగళవారం డ్రాప్అవుట్ చిన్నారులకు అవగాహన కల్పించారు.

22న భగత్‌సింగ్ జీవితంపై సమాలోచన సదస్సు

కపిలేశ్వరపురం: ఈ నెల 22న రామచంద్రపురంలో భగత్‌సింగ్ ఆలోచన– ఈ నాటి ఆవశ్యకత అనే అంశంపై సమాలోచన సదస్సు నిర్వహించనున్నట్టు సామాజిక కార్యకర్త గౌరవ్ మంగళవారం తెలిపారు. డాక్టర్ చెలికాని స్టాలిన్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో నిర్వహించే సదస్సులో వీక్షణం మాస పత్రిక నిర్వాహకులు ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తారన్నారు. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు.

ఆట పాటలతో చిన్నారులకు బోధన


వెదురుమూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మహిళా పోలీస్, అంగన్‌వాడీ

కపిలేశ్వరపురం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు ఆట పాటలతో చదువు చెప్పే కార్యాచరణను చేపట్టారు. ఐసీడీఎస్ అనుబంధ శాఖల సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ముమ్మరం చేశారు. సచివాలయాల్లోని మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం రూపొందించిన సీఆర్ యాప్‌ను పర్యవేక్షిస్తున్నారు. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు ఆట పాటలతో విద్యా, వైజ్ఞానిక వికాసాన్ని పెంపొందించేలా కార్యాచరణను అమలు చేస్తున్నారు. వెదురుమూడి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ తీరును మహిళా పోలీస్ గెద్దం ప్రమీల పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, యానం రహదారిలో చేదువాడ వంతెన వద్ద మంగళవారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జగన్నాథపురానికి చెందిన తడాల రాజశేఖర్ తన స్కూటరుపై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. చేదువాడ వంతెన వద్దకు వచ్చేసరికి స్కూటర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో రాజశేఖర్ గాయాల పాలవగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కె.గంగవరం: మండలంలోని యర్రపోతవరంలో అక్రమంగా అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని కె.గంగవరం పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్సై జానీ భాషా మాట్లాడుతూ గ్రామానికి చెందిన దుండ్రోలు ఈశ్వరరావు ఏపీకి చెందిన 20 మద్యం బాటిళ్లను అమ్ముతుండగా ఆ వ్యక్తిని అరెస్టు చేసి మద్యాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైన అక్రమంగా మద్యం అమ్మితే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం: రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితం 33/11 కేవీఏ విద్యుత్ స్టేషన్‌లో బ్రేకర్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. బొమ్మూరు ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన సాంకేతిక సిబ్బంది బ్రేకర్‌లోని సాంకేతిక లోపాన్ని సవరించారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా రాయవరం, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, బిక్కవోలు మండలం కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

పేదలకు స్థిరాస్తి

- యజ్ఞంలా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్
- ఆస్తిపై సంపూర్ణ హక్కు కల్పిస్తున్న ప్రభుత్వం
- రెండు నియోజకవర్గాల్లో 19458కి లబ్ధి


రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకుంటున్న లబ్ధిదారు

రామచంద్రపురం: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మారాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కా గృహాలు మంజూరు చేసింది. జగనన్న లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. సచివాలయాల వద్ద ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు కోలాహలంగా కనిపిస్తుంది. పేదలకు ప్రభుత్వ స్థిరాస్తిని అందించేందుకు జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ డివిజన్ పరిధిలో సుమారుగా 80 శాతం వరకు పూర్తి కావచ్చింది. పేదలకు ప్రభుత్వం స్థిరాస్తిని కల్పించటం చరిత్రాత్మక ఘట్టం. పేదల ఇళ్ల పట్టాలకు జగన్ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కును కల్పిస్తుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గల పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఇళ్ల పట్టాలు పొందిన అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ యజ్ఞంలా సాగుతుంది.

యజ్ఞంలా రిజిస్ట్రేషన్లు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల పట్టాలు పొందిన వారు 19,458 మంది ఉండగా ఇప్పటివరకు 16,683 మందికి సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసి వారికి ఆస్తిపై సంపూర్ణ హక్కును కలిగించింది. రెండు నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే లబ్ధిదారులకు అందించిన పట్టాలకు చెందిన స్థలాలను లేఅవుట్‌లు చేసి అందించారు. ఆయా స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారుగా రూ.450 కోట్ల విలువ చేసే ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ద్వారా విలువైన స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు అందనున్నాయి. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలను అందజేసి వాటిని రిజిస్ట్రేషన్ చేసి అందించటంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	లబ్ధిదారులు	పూర్తయిన రిజిస్ట్రేషన్‌లు
కపిలేశ్వరపురం	1753	1318
కె.గంగవరం	2089	1761
మండపేట	5240	4622
రామచంద్రపురం	6395	5580
రాయవరం	2143	1968
కాజులూరు	1838	1434
మొత్తం	19458	16683


లబ్ధిదారులకు అందిస్తున్న రిజిస్ట్రేషన్ పత్రాలు

వీఆర్వోల ద్వారా రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా సచివాలయ పరిధిలోని వీఆర్వోలే ప్రభుత్వం తరఫున పూర్తి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నియమ నిబంధనల ద్వారా పట్టాదారులకు రిజిస్ట్రేషన్లు సాగిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఇప్పటికే సుమారుగా 80 శాతం పైగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాగా ఆయా లబ్ధిదారులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తున్నారు.

పేదల పక్షాన ప్రభుత్వ నిర్ణయం



ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనతో లక్షలాది మంది లబ్ధిదారులకు ఎంతో మంచి చేకూరుతుంది. భవిష్యత్‌లో తమ అవసరాల కోసం సదరు స్థలాన్ని వారసులకు అప్పగించాలన్న, వేరొకరికి బదిలీ చేసుకునే హక్కును ఈ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వం కల్పించింది.
– పిల్లి సూర్యప్రకాష్, నియోజకవర్గ కోఆర్డినేటర్

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం




పేదలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ఇంటి స్థలం ఇవ్వటంతో పాటుగా ప్లాటను రిజిస్ట్రేషన్ చేసి దానిపై పూర్తి హక్కును కల్పించటం చాలా మంచి కార్యక్రమం. పేదల బతుకులకు భరోసానిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాము.
– బొమ్మి ప్రసన్న, వైఎస్సార్ నగర్, రామచంద్రపురం

ఆనందంగా ఉంది



మాలాంటి పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయటమే కాకుండా ఆ స్థలాన్ని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం చాలా ఆనందంగా ఉంది. మాకంటూ ఒక స్థిరాస్తిని కల్పించిన ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
– పున్నం కల్యాణి, టీహెచ్ వీధి, రామచంద్రపురం

సీఎం జగన్‌కే దళితుల మద్దతు


పండు గోవిందరాజు

కె.గంగవరం: సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దళితులందరూ మద్దతు పలుకుతారని నియోజకవర్గ దళిత నాయకులు, ద్రాక్షారామ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో దళితల సంక్షేమానికి ఎంతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అన్ని వర్గాల ఆరాధ్యుడైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహానికి దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించి ప్రారంభించారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళిత వర్గాలకు అగ్రస్థానం అందించారన్నారు. పలు నామినేటెడ్ పోస్టుల్లో దళితలకు స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు మరింతగా మద్దతు తెలిపి సంక్షేమానికి, పేదల తల రాతలు మార్చే విధంగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ


మామిడికుదురు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. స్కూల్ వద్ద పరిస్థితిని నగరం ఎస్సై పి.సురేష్‌తో కలసి సమీక్షించారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోసం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన నగరం విద్యార్థులు

మామిడికుదురు: ఈ నెల 18న నందిగామలో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరం విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం గుబ్బల మౌనిక మంగళవారం తెలిపారు. కొంబత్తుల రోషన్, ఆకుమర్తి అవినాష్, మడిమెట్ల అభిషేక్, ఉండ్రాజవరపు పూజశ్రీ, జక్కంపూడి నాగశ్రీకర్, బిక్కిన రేష్మమన్విత, చింతా కల్యాణి, శీలం కార్తీక్ వెంకటసాహి, తాడి వర్ధనబాబు జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ మట్టా శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో డీవీవీ సత్యనారాయణ, జక్కంపూడి శివప్రసాద్, పీడీ బొమ్మిడి ధర్మ పాల్గొన్నారు.

పీచు బొమ్మల కొనుగోలుకు ప్రతిపాదనలు

మామిడికుదురు: కోనసీమలో మహిళలు కొబ్బరిపీచుతో తయారు చేస్తున్న బొమ్మలను కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి విక్రయ కేంద్రాల ద్వారా అమ్మేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కాకినాడ లేపాక్షి మేనేజర్ వీరబాబు తెలిపారు. ఆయన మంగళవారం పాశర్లపూడిలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో నిర్వహిస్తున్న గ్రామ దుకాన్ కొబ్బరి పీచు బొమ్మల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమలో మహిళలు తయారు చేస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది మహిళలకు ఉపాధి పెరుగుతుందన్నారు.

మండపేటలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- రాబోయే ఫలితంపై ఎమ్మెల్యే వేగుళ్ల ఆందోళన
- ఆయన మాటల వెనుక అభద్రతాభావం ఉంది
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మరో రెండు నెలల్లో రాబోయే ఎన్నికల ఫలితంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆందోళనలో ఉన్నారని, మండపేటలో విజయం వైఎస్సార్ సీపీదేనని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన వ్యాఖ్యానాలను ఎమ్మెల్సీ తోట ఖండించారు. మండపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కుడుపూడి భవాని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజుతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యల తీరును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తప్పుబట్టారు. టీడీపీ కార్యకర్తలను బెదిరిస్తున్నారని, రౌడీయిజం పెరిగిపోయిందంటూ ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. అలాంటి ఘటనలు జరిగి ఉంటే ఒక్కటైనా నిరూపించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను తాట తీస్తాను, నాలుక కోస్తానంటూ ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యలను చూస్తుంటే నక్క పులి వేషం వేసినట్టు అనిపించిందన్నారు. ఐదేళ్లలో ప్రజలకు దూరమైన ఎమ్మెల్యే వేగుళ్ల ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఏమి చెప్పాలో తెలియక ఎదుటి పార్టీలపైనా, నాయకులపైనా నిందలు వేస్తుండటం హాస్యాస్పదమన్నారు. మరో రెండు నెలల్లో అధికార పార్టీ నేత స్థానికంగా ఉండరంటూ చేసిన వ్యాఖ్య ఆయనలోని ఆందోళనను తెలియజేస్తోందన్నారు. మండపేటలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, తాను మండపేట నియోజకవర్గంలోనే ఇల్లు కట్టుకుంటున్నానని, ఇక్కడే స్థిరపడతానని ప్రజలకు, కార్యకర్తలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. టీడీపీ కూటమిదే అధికారమంటూ ఎమ్మెల్యే వేగుళ్ల చేస్తున్న ప్రచారం పేలవంగా ఉందన్నారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ప్రజలు చూపుతున్న ఆదరణ మరే నాయకుడికీ చూడలేదన్నారు. దెందులూరు సిద్ధం సభకు నియోజకవర్గంలో జనం అధిక సంఖ్యలో రావడంతో అదనపు వాహనాలను ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. ప్రజలు సీఎం జగన్ పక్షాన ఉన్నారని ఆయన అన్నారు. ఆ వాస్తవం తెలుసుకోలేని స్థితిలో ఎమ్మెల్యే వేగుళ్ల ఉన్నారన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల పోటీలో నిలిచారు కాబట్టి ఇప్పటికైనా ప్రజల మధ్యకు వెళ్లి గత ఐదేళ్లలో ఏం మేలు చేశారో, ఇకపై గెలిపిస్తే ఏం చేస్తారో చెప్పాలన్నారు. నాయకుడంటే ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేనున్నాననే నమ్మకం, భరోసా ఇవ్వాలన్నారు. అదే ఒరవడిలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని స్పష్టం చేశారు. నాయకులు పట్టాభి, రాజుబాబు, బాపిరాజు మాట్లాడుతూ నియోకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సూర్యప్రకాష్‌కే మా మద్దతు


ఎంపీ బోస్, ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్‌లను కలిసిన కాపు నేతలు

నియోజకవర్గ కాపు సంఘం నేతలు

రామచంద్రపురం: ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్‌కే తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు రామచంద్రపురం నియోజకవర్గ కాపు సంఘం నేతలు వెల్లడించారు. ఎంపీ సుభాష్‌చంద్రబోస్‌ను రామచంద్రపురం మండలం వైస్ ఎంపీపీ శాఖ బాబి, అన్నయ్యపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు,. జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, రామచంద్రపురం మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు పెంటపాటి శ్రీనివాసరావు, పోతంశెట్టి శ్రీనివాస్, ద్రాక్షారామ నాయకులు చల్లా బుజ్జి మంగళవారం హసన్‌బాదలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జరగబోయే ఎన్నికల్లో మీ అబ్బాయి సూర్య ప్రకాష్‌కి మా సహకారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని కాపు నేతలను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సూర్యప్రకాష్‌ను గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


అగ్నికుల క్షత్రియ సంఘానికి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పిల్లి సూర్యప్రకాష్ తదితరులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘంలోని సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎంగా జగన్ మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులమై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ, కాదా గోవింద్, రచ్చ కిట్టయ్య, ఆకుల రాంబాబు, లంక శ్రీను, రచ్చ మహాలక్ష్మి, పెమ్మాడి సల్మాన్‌రాజు, రచ్చ అన్నవరం, చింత ఆదినారాయణ, తేలు శ్రీను, సంగాడి వెంకటేశ్వరరావు, తేలు గోవింద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


గొల్లపాలెంలో సురక్ష కార్యక్రమాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్

కాజులూరు: గ్రామాల్లో పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ అన్నారు. గొల్లపాలెం మార్కెట్ సెంటర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎం అండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపి దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స అందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తారన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీఎల్ శ్రీయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు చాంద్ బాషా, పి.మౌనిక, సత్తిబాబు తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 109 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించిన 10 మంది రోగులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. నరాల రాజారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అయినవిల్లి: రోడ్డు ప్రమాదంలో అయినవిల్లి సర్పంచ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీను ముక్తేశ్వరం–అయినవిల్లి బైపాస్ రోడ్డులో అయినవిల్లి పెదపేటలోని తన బైక్‌పై వస్తున్నారు. అదే రోడ్డులో తన వెనుక వస్తున్న మరో బైకిస్టు బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు గాయాలయ్యాయి. అలాగే అతడితో పాటు మరో బైకిస్టు, అతని భార్యకు గాయాలయ్యాయి. గాయాలైన వీరిని అమలాపురంలో ఆస్పత్రికి తరలించారు.

పిచికారీలో అప్రమత్తత అవసరం

- స్ప్రేయర్లను శుభ్రం చేసి భద్రపర్చాలి
- రైతులు, వ్యవసాయ కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


వరి పైరుపై పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు


కేవీఎస్ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: సాగు సజావుగా సాగాలంటే సకాలంలో నీరు సరిపడా అందాలి. అందుకోసం నీటి వనరుల లభ్యత, ఏదశలో ఎంత మేరకు నీటితడులు పెట్టాలన్నదానిపై రైతుకు అవగాహన అవసరం. ఆ తర్వాత అవసరమైన మేరకు ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేయాలి. మందును పిచికారీ చేసేటప్పుడు పంట సస్యరక్షణతోపాటు తన ఆరోగ్య రక్షణకూ జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ పనుల్లో కాయకష్టం చేయడం అలవాటైనదే అయినప్పటికీ పంటకు ఎరువులు, పురుగు మందులు వాడేటప్పుడు రైతు శారీరకంగా, మానసికంగా అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. మరీ ముఖ్యంగా మందులను పిచికారీ చేసే యంత్రాల వినియోగంలో అవగాహన అవసరం. పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు వ్యవసాయ శాఖాధికారులు, వైద్యుల సూచనలను పాటించాల్సిందే. కపిలేశ్వరపురం మండలం వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ చేస్తున్న సూచనలు ఇలా..

రెండు నియోజకవర్గాల్లో వరి సాగు వివరాలు

రామచంద్రపురం నియోజవర్గంలోని 75 గ్రామాల్లో 53,249 ఎకరాలు, మండపేట నియోజవర్గంలోని 43 గ్రామాల్లో 47,418 ఎకరాలు, మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

ఖాళీ డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి. పురుగుల మందు ప్రభావంతో అస్వస్థకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స చేయాలి. అందులో భాగంగా రోగి శరీరానికి ఉష్ణోగ్రత అధికంగా ఉంటే తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి. ఉష్ణోగ్రత మరీ తక్కువగా ఉంటే దుప్పటి కప్పాలి. నోటిలో వేలు పెట్టి వాంతి అయ్యేలా చేయాలి. ప్రథమ చికిత్స చేసిన అనంతరం రోగిని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాలి. చేనుకు వాడిన మందు తాలూకు వివరాలు వైద్యునికి తెలియజేయాలి.

స్ప్రేయర్లను భద్రపర్చే విధానం

స్ప్రేయర్లును ఒక్కో దశలో మాత్రమే వినియోగిస్తారు. పని అయిన తర్వాత పక్కన పడేస్తారు. ఇలా చేయడం వల్ల అవి పాడయ్యే ప్రమాదం ఉంది. అందుకోసం ఈ విషయాలు గుర్తు చేసుకోవాలి. ఆధునికత నేపథ్యంలో బ్యాటరీ రీచార్జిబుల్ స్ప్రేయర్లు ఉనికిలోకి వచ్చాయి. పవర్ స్ప్రేయర్లతో పోలిస్తే బ్యాటరీ రీ చార్జిబుల్ స్ప్రేయర్లు బరువు తక్కువ. పైరుపై మందు వేగంగా తగు మోతాదులో చిమ్ముతుంది. వీటిని భద్రపర్చేందుకు నీటిని స్ప్రే చేస్తూ శుభ్రం చేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి కనీసం ఒక గంట పాటు చార్జింగ్ పెడుతుండాలి. దీని ద్వారా బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుంది. పవర్ స్ప్రేయర్ టర్బోరేటర్, ట్యాంకులోనూ పెట్రోల్ లేకుండా చూసుకోవాలి. పిచికారీ ప్రక్రియ పూర్తికాగానే మంచి నీటితో శుభ్రం చేయాలి. ప్లగ్‌ను తీసి పెట్రోల్‌తో శుభ్రపర్చి, పిస్టన్‌పై కాస్త ఇంజన్ ఆయిల్‌ను వేసి బిగించాలి. తైవాన్ స్ప్రేయర్‌లో ఐదారు లీటర్లు నీరు పోసి నాజిల్ ద్వారా బయటకు స్ప్రేయాలి. దీని వల్ల స్ప్రేయర్‌లో చిక్కుకున్న మలినాలు బయటకు వచ్చేస్తాయి. హ్యాండ్ స్ప్రేయర్లు విషయంలో ఇత్తడి స్ప్రేయర్ గొట్టం తీసి అందులో కాస్త ఇంజిన్ ఆయిల్ పోసి బిగించాలి. దీనివల్ల తుప్పు పట్టకుండా ఉంటుంది. హైటెక్ స్ప్రేయర్లులో బుష్‌లు, రాడ్లకు ఇంజిన్ ఆయిల్‌ను పూయాలి.